

సోమవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఏడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలంటూ.. తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | HYDERABAD




డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలంటూ సోమవారం నారాయణగూడ చౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న నేతలు




# సరికొత్త ఆశలు..!

రేపే నయా సాల్

## కొత్త నిర్ణయాలతో టైం టేబుల్స్

### గత వైఫల్యాలు కొనసాగకుండా..


### న్యూ ఇయర్ తీర్మానాలతో అనేక లక్ష్యాలు

సిటీబ్యూరో: మరో కొన్ని గంటల్లో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2024కి వీడ్కోలు పలుకుతూ సరికొత్త ఆశలతో 2025ను ఆహ్వానించబోతున్నాం. ఈ మధుర క్షణాలను ప్రతి ఒక్కరూ ఎంతో వైభవంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరూ కుటుంబ సమేతంగా వేడుకలు ఏర్పాటు చేసుకుంటే..మరి కొందరూ స్నేహితులతో రిసార్టులు, ఈవెంట్ వేడుకలకు వెళ్లడానికి రెడీ అయ్యారు. మొత్తంగా నగరం కొత్త ఏడాది ఉత్సవానికి సిద్ధమైంది. సాయంత్రం నుంచే '31' సంబురాలు ఊపందుకోనున్నాయి. గడిచిన క్షణాల నుంచి మంచిని తీసుకొని రాబోయే కాలంలో విజయాల వైపు నడిచేందుకు న్యూ ఇయర్ తీర్మానాల్లో భాగంగా వారి డైరీలో ప్రణాళికలు రాసుకుంటున్నారు. ఇప్పటి వరకు చేయాలనుకున్నవి చేయలేకపోవడానికి కారణాలను పరిశీలించుకొని ఇకపై వచ్చే రోజుల్లో అన్ని సక్రమంగా చేసుకునేలా తమకు తాము సూచనలు చేసుకుంటున్నారు. కొందరు రోజూ ఉదయం వాకింగ్ చేయడం, ఇంకొందరు జిమ్‌కు వెళ్లడం, మరికొందరు పుస్తకాలు చదవడం, కొత్త భాషలు నేర్చుకోవడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం తదితర లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏడాదిలోనైనా ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేస్తామంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతుండటం విశేషం.

#### ఉచితంగా రవాణా సేవలు

తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో 'హమ్ ఆప్కే సాథ్ హై' థీమ్‌తో మద్యం సేవించి వాహనం నడపకూడదని క్యాంపెయిన్ జరుగుతున్నది. అందులో భాగంగా డిసెంబర్ 31 రాత్రి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో 500 కార్లు, 250 బైక్ టాక్సీలు ఉచితంగా రవాణా సేవలందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. 31న రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. 9177624678 నంబర్‌కు ఫోన్ చేసి డ్రాపింగ్ వివరాలు తెలుపాలని సూచించారు.

# బల్దియాకు భూసేకరణ గండం!



## ఆస్తుల స్వాధీనంపై స్పష్టత లేకుండానే హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన

### కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు,అండర్‌పాస్‌లు..

### సవాల్‌గా మారిన ఆస్తుల సేకరణ

### రూ.2వేల కోట్లకు పైగా అయ్యే చోట..

### కేవలం బడ్జెట్‌లో రూ. 700కోట్లు మాత్రమే కేటాయింపు

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఫ్లై ఓవర్లు.. ఆర్వోబీ.. ఆర్‌యూబీలు, రహదారులు, నాలాల విస్తరణ..లింకు రోడ్లు.. అభివృద్ధి ఏదైనా సకాలంలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే భూసేకరణ అత్యంత కీలకం. ఆయా ప్రాజెక్టు వ్యయం ఎంత ఖర్చు అవుతుందో..భూసేకరణకు అంతే స్థాయిలో వ్యయం అవుతుంది. అయితే ఆస్తుల సేకరణలో జీహెచ్‌ఎంసీ లోపభూయిష్టంగా వ్యవహరిస్తున్నది. ఒక ప్రాజెక్టు పనులు ప్రారంభం సమయంలోనే దాదాపు ఆస్తుల స్వాధీనంలో పై చేయిగా ఉండాలి. కానీ ఘనత వహించిన జీహెచ్‌ఎంసీ భూసేకరణపై స్పష్టత లేకుండానే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయడం అధికారుల పనితీరును నిదర్శనం. అంతేకాకుండా పురోగతిలో ఉన్న ప్రాజెక్టు పనుల్లో భాగంగా అన్నింటికీ భూసేకరణకు అయ్యే నిధుల విషయంలో స్పష్టత ఉండాలి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) వార్షిక బడ్జెట్‌లో హెచ్ సిటీ-1 కింద చేపట్టనున్న మొత్తం పనులకు సర్కారు రూ. 2654 కోట్లను ప్రకటించినా, ఇప్పటి వరకు కేవలం రూ.852 కోట్లకు మాత్రమే పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో స్థల సేకరణకు జీహెచ్‌ఎంసీ మొత్తం రూ.700కోట్లను కేటాయించింది. కానీ ఒక్క కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ఫ్లై ఓవర్లు, ఏడు అండర్‌పాస్‌లను చేపట్టనున్న హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు రూ. 510 కోట్లు కేవలం స్థల సేకరణకు వెచ్చించనున్నారు. అంతేకాకుండా బంజారాహిల్స్ విరంచి హాస్పిటల్ నుంచి కేబీఆర్ పార్కు వరకు రహదారి విస్తరణకు భూ సేకరణకు మరో రూ. 150కోట్ల ఖర్చు చేయనున్నారు. ఇక నగరంలో పలు చోట్ల హెచ్ సిటీ ప్రాజెక్టు కింద నాలాల అభివృద్ధి, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణాలు జరగనున్నాయి. కానీ వీటికి మాత్రం భూ సేకరణకు అయ్యే నిధులపై అధికారులకు స్పష్టత లేదు. దీంతో వచ్చే ఏడాదిలో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. భూ సేకరణకు నిధుల గండం పొంచి ఉండడంతో వచ్చే ఏడాది మొత్తంలోనూ హెచ్ సిటీ ప్రాజెక్టు పూర్తికి మోక్షం కలగడం కష్టమేనన్న అభిప్రాయాలు ఇంజినీర్లలో వ్యక్తమవుతున్నది.

#### పాత నగరంలో సవాల్‌గా మారిన భూ సేకరణ

గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాల కోసం చేపట్టే భూ సేకరణ, ఆస్తుల సేకరణ సందర్భంగా జీహెచ్‌ఎంసీ టీడీపీఆర్ పత్రాలను అందజేస్తున్నారు. అభివృద్ధి పనులకు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించి, నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ఈ టీడీఆర్‌ను ఇస్తున్నారు. ఏదైన ఒక నిర్వాసితుడు నాలా విస్తరణ వల్ల ఏ మేరకు స్థలాన్ని కోల్పోయాడో, అంతకు నాలుగు రెట్లకు టీడీఆర్ పత్రాలను పరిహారంగా పొందుతాడు. ఉదాహరణకు అమీర్‌పేటలో 20 గజాల స్థలాన్ని కోల్పోయిన నిర్వాసితుడు జీహెచ్‌ఎంసీ ఇచ్చే 80 గజాల టీడీఆర్ పత్రాన్ని తీసుకుని ఇతరులకు విక్రయించుకునే హక్కు పొందుతాడు. టీడీఆర్ పత్రం కలిగిన వారు, జీహెచ్‌ఎంసీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఇచ్చే అనుమతికి అదనంగా చేపట్టే నిర్మాణ వైశాల్యాన్ని నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఫలితంగా లక్ష రూపాయలు ఇవ్వాల్సిన పరిస్థితుల్లో..టీడీఆర్ ద్వారా అంతకు రెట్టింపు లేదా, తనకు నచ్చిన మొత్తానికి విక్రయించుకొని లాభపడుతున్నారు. అయితే పాతనగరం మినహా ఇతర ప్రాంతాల్లో ఈ టీడీఆర్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. మార్కెట్లో టీడీఆర్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. కానీ పాతనగరంలో మాత్రం టీడీఆర్‌లకు వద్దంటున్నారు. దీనికి వారిలో అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యమేనని చెప్పవచ్చు. మొత్తంగా పాత నగరంలో వివిధ అభివృద్ధి పనులకుగానూ ఆస్తుల సేకరణ నత్త నడకనా సాగుతున్నది. ఎస్ఆర్‌డీపీలో భాగంగా జూ పార్కు-ఆరాంఘర్ ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్ల విస్తరణ, సైదాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి పనుల్లో భాగంగా ఆస్తుల సేకరణే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. వీటితో పాటు నాలాల అభివృద్ధి, రహదారుల విస్తరణలో భూసేకరణ జాప్యమవుతున్నది. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం టీడీఆర్ వద్దంటున్నారంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతుండడంతో స్పెషల్ ఫండ్ కింద పాత నగరంలో భూ పరిహార బాధితులకు ప్రభుత్వం నుంచే నష్ట పరిహారం అందజేస్తూ వస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఆలస్యంగా వస్తుండడంతో ఆస్తుల సేకరణ సందిగ్ధంలో పడింది.



నగరంలో సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం నాచారం రోడ్డులో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ ఇది.

# నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో: కొత్త ఏడాది సందర్భంగా మూడు కమిషనరేట్ పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పీవీఆర్ ఎక్స్‌ప్రెస్ వే మార్గాన్ని కూడా మూసివేయనున్నట్టు తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు మినహా మేరే ఇతర వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఈ మార్గాల్లో వెళ్లే వాహనదారులు, డ్రైవర్లు డ్రెస్‌కోడ్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరించే వాహనదారుల సమాచారం 9490617646 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. నగరంలో బేగంపేట, టోలిచౌకీ మినహా అన్నీ ఫ్లై ఓవర్లు మూసివేయనున్నట్టు తెలిపారు. ప్రైవేట్ బస్సులు, లారీలు, హెవీ గూడ్స్ వాహనాలు రాత్రి 10 నుంచి ఉదయం 2 గంటల వరకు అనుమతించబోమని వివరించారు.




కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు బ్రిగేడియర్, అధికారులు

# రోడ్డు విస్తరణకు.. బోర్డు పచ్చజెండా

### ఓటీఎస్ గడువు పెంచుతూ నిర్ణయం

### బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

### తాగునీటి సరఫరా బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని సూచన

### జూబ్లీ బస్‌స్టేషన్ ఆవరణలోని స్థలం ఐదేండ్ల పాటు పార్కింగ్ కోసం లీజుకు బోర్డు ఆమోదం

కంటోన్మెంట్, డిసెంబర్ 30: బోర్డు పరిధిలో ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం కోసం 60 మీటర్ల మేరకు రోడ్డు విస్తరణకు కంటోన్మెంట్ బోర్డు పచ్చజెండా ఊపింది. సోమవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో హెచ్‌ఎండీఏ అధికారుల సమక్షంలో నిర్వహించిన చర్చ అనంతరం బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర సారథ్యంలో జరిగిన బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో పాటు, సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వన్షీ, బోర్డు సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు. కంటోన్మెంట్ పరిధిలో రోజుకు అదనంగా 10 లక్షల గ్యాలన్ల చొప్పున నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయంలో వాస్తవాలు వెల్లడించాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు అధికారులను కోరారు. కంటోన్మెంట్‌కు గతంలో రోజుకు 5.9 మిలియన్ గ్యాలన్ల నీరు మాత్రమే సరఫరా అయ్యేదని, ప్రస్తుతం 6.9 మిలియన్ గ్యాలన్లు అందుతున్నదని బోర్డు అధికారులు పేర్కొన్నారు. నీటి బకాయిల చెల్లింపు విషయంలో కొందరు స్థానిక నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి 44, రాష్ట్ర రహదారి 01 మార్గాల్లో చేపట్టనున్న రోడ్డు విస్తరణను ప్రైవేటు స్థలాలు ఉన్న చోట 60 మీటర్లకు బదులుగా, 40 మీటర్లకు కుదించాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ ప్రస్తావించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 60 మీటర్ల మేరకు విస్తరించడం తప్పనిసరి అని హెచ్‌ఎండీఏ అధికారులు స్పష్టం చేశారు. పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు తగిన న్యాయం చేస్తుందని, ఈ మేరకు తాను చొరవ చూపుతానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ భరోసా ఇచ్చారు. ఈ విషయంలోనూ అధికారులు ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలన్నారు. తాగునీటి సరఫరా బాధ్యతలను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు.

#### జనవరి 31 వరకు గడువు పెంచుతూ..

తాగునీటి బకాయిలకు సంబంధించి ప్రవేశపెట్టిన వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్) గడువును జనవరి 31 వరకు పెంచుతూ బోర్డు ఆమోదం తెలిపింది. టీపీటీ, సర్వీసు చార్జీలపై ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ (టీపీటీ) ఆదాయం గతంలో మాదిరిగా నేరుగా కంటోన్మెంట్‌కు చెల్లించేలా ప్రతిపాదన వస్తే, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ప్రతీసారి టీపీటీ రాష్ట్ర ఖజానాలోకి వెళ్లడం, తిరిగి చెల్లించడంలో ఆలస్యం జరుగుతూ ఉండటంతో కొందరు దీన్ని రాజకీయానికి వాడుకుంటున్నారన్నారు. తాను కోర్టుకెళితేనే టీపీటీ బకాయిలు విడుదలవుతాన్నయంటూ చెప్పుకునే నామినేటెడ్ సభ్యుడు, కేంద్రం చెల్లించాల్సిన రూ.900 కోట్లకు పైగా సర్వీసు చార్జీల కోసం ఇదే విధంగా పోరాడాలన్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం సేకరించే ప్రైవేటు ఆస్తులకు సంబంధించి సమాన విలువ కలిగిన పరిహారం ఇవ్వాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ కోరారు. కంటోన్మెంట్‌లో పదేండ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తక్షణమే బోర్డు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జూబ్లీ బస్‌స్టేషన్ ఆవరణలోని స్థలాన్ని ఐదేండ్ల పాటు పార్కింగ్ కోసం లీజు ఇచ్చేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

# ఆ పబ్‌లో 8 మందికి డ్రగ్ పాజిటివ్



శేరిలింగంపల్లి, డిసెంబర్ 30: గచ్చిబౌలిలోని ఓ పబ్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 8 మందికి డ్రగ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధి కొండాపూర్‌లో ఆదివారం రాత్రి క్వాక్ పబ్‌లో టీన్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది నుంచి పోలీసులు డ్రగ్స్ నిర్ధారణ నమూనాలు సేకరించారు. మూత్ర శాంపిల్స్‌లో నలుగురికి, సేలైవా శాంపిల్స్‌లో మరో నలుగురికి మొత్తం 8 మందికి ఈ తనిఖీల్లో పాజిటివ్ నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. కొండాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాక్ పబ్‌లో ఆదివారం రాత్రి బెన్ భూమర్ బ్లూమ్ లైవ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు వచ్చిన వారికి డ్రగ్ తనిఖీలు చేపట్టగా.. పాజిటివ్ నిర్ధారణ అయిందని, పబ్‌లో ఎలాంటి డ్రగ్స్ లభించలేదని పోలీసులు తెలిపారు. పాజిటివ్ వచ్చిన 8 మందిలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ 27 సెక్షన్ కింద కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేపడుతున్నారు. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకొని టీన్యాబ్, ఎస్వోటీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# అభివృద్ధి పనులకు సర్కారు సహకరించాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి: అభివృద్ధి పనులకు ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మచ్చ బొల్లారం డివిజన్‌లోని ఏడు కాలనీల వర్షపు నీటి నిలువ సమస్యను పరిష్కరించేందుకు డ్రైన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో ఫైర్ స్టేషన్ కోసం గ్రామకంఠం స్థలాన్ని కేటాయించాలని, నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాళ్లను నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా.. నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని చెప్పారు. నిధులు కేటాయించాలని గతంలో ఉన్న ఇద్దరు కమిషనర్లకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.